రేపు ఆలయంలో పంచామృత అభిషేకం

జగద్గిరిగుట్ట: శ్రావణ నక్షత్రం సందర్భంగా ఆదివారం పద్మానగర్ ఫేజ్ 1లోని శ్రీదేవి భూదేవి సహిత కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారికి పంచామృత అభిషేకం 108 కలుశాలతో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులందరూ పాల్గొని స్వామివారి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని పేర్కొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ సుచిత్రలోని నారాయణ హైస్కూల్‌లో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. ఏజీఎం పురుషోత్తం రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు.

42 శాతం రిజర్వేషన్లు చరిత్రాత్మకం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ జీ సారయ్య
- మంత్రివర్గం తీర్మానంతో క్షీరాభిషేకం



కొంపల్లిలో చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుత్బుల్లాపూర్/దుండిగల్: కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం చరిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీ సారయ్య అన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశంలో తీర్మానం చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. కొంపల్లిలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందన్నారు. హామీల అమలుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కూన శ్రీశైలంగౌడ్, సుధీర్‌రెడ్డి, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు వజ్రేష్ యాదవ్, కొలన్ హన్మంత్‌రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, నేతలు దుర్గం భాస్కర్, మిథున్‌రెడ్డి, పీసరి మహేందర్‌రెడ్డి, సత్యం శ్రీరంగం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నరసింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మిఠాయి తినిపిస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎమ్మెల్సీ జీ సారయ్య



కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ ముఖ్య నేతలు

కుత్బుల్లాపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బీ సారయ్య అన్నారు. కొంపల్లిలోని ఎస్ఎస్ఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి ఆయనతో పాటు జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కూన శ్రీశైలంగౌడ్, సుధీర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్ణయాలు, పార్టీ బలోపేత అంశాలపై చర్చించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ నేత చెరుకుపల్లి చంద్రారెడ్డి వర్ధంతి



కుత్బుల్లాపూర్: బీజేపీ సీనియర్ నాయకుడు, స్వర్గీయ చెరుకుపల్లి చంద్రారెడ్డి 34వ వర్ధంతిని శుక్రవారం జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్‌లో నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రారెడ్డి కృషితోనే సమీపంలోని బస్తీలు ఏర్పడ్డాయని, అనేక మంది పేదలకు గూడు కల్పించిన మహనీయుడని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి, కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌యాదవ్, ఎం.ఎస్.వాసు, డివిజన్ అధ్యక్షుడు రాజు, రాజేష్, కేశవ్‌యాదవ్ సంజీవరెడ్డి, వీరారెడ్డి, దుర్గయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ఘనంగా బోనాలు



కుత్బుల్లాపూర్: బోనాలు పండుగ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అని శివశివానీ ఇనిస్టిట్యూట్ వైస్ ప్రెసిడెంట్ శైలేష్ సంపతి అన్నారు. శుక్రవారం కొంపల్లిలోని శివశివానీ డిగ్రీ కళాశాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ దీపికా సంపతి, కళాశాల ప్రిన్సిపాల్ మమత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం

శివశివానీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభోత్సవాన్ని 3(టి) బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ టి. సరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్‌సీసీ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడంతో పాటు భారత సైన్యంలో చేరేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నిజాంపేట్: ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం వై.వెంకట సుబ్బారెడ్డి కుమారుడు వై.సాయి నిశాంత్‌రెడ్డి గురువారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో జిమ్ నుంచి వచ్చి భోజనం చేశాడు. ఎప్పటిలాగే భోజనం చేసిన తరువాత వాకింగ్ కోసం ప్రగతినగర్‌లోని తమ అపార్ట్‌మెంట్ టెర్రస్‌కి వెళ్లాడు. రాత్రి 9:30 గంటల ప్రాంతంలో వెంకట సుబ్బారెడ్డికి కొంతమంది అరుపులు వినిపించాయి. అక్కడికి వెళ్లి టెర్రస్‌పై పరిశీలించగా.. తన కొడుకు కనిపించలేదు. వెంటనే అపార్ట్‌మెంట్ ముందు రోడ్డు దగ్గరకు దిగివచ్చి చూడగా.. తన కొడుకు కాలు విరిగి, ముఖంపై గాయాలతో రోడ్డుపై పడి ఉన్నట్లు గమనించారు. వెంటనే చికిత్స కోసం ఓ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

చింతల్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీఎన్జీవో అధ్యక్షుడు కొలన్ వాసు అన్నారు. ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన టీఎన్జీవో నేతలు శుక్రవారం జీడిమెట్లలోని ఈఎస్ఐ హాస్పిటల్‌ను సందర్శించారు. అనంతరం జీడిమెట్ల ఈఎస్ఐ డిస్పెన్సరీ ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ రవీందర్ గౌడ్, డయాగ్నస్టిక్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవో నేతలుగా గెలుపొందిన సెక్రటరీ సయ్యద్ గౌసుద్దీన్ జాఫర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం అఖిలాన్, ఉపాధ్యక్షులు ఎండి రఫీ దిన్ వంశీ, ట్రెజరర్ జూలై, సంయుక్త కార్యదర్శి శరత్ చంద్ర, సభ్యుడు జయంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

కుత్బుల్లాపూర్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో దేవరయాంజాల్‌లో పోలీసులు దాడులు నిర్వహించి షేక్ బాషా అనే వ్యక్తి నుంచి 440 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దోమల నివారణపై అవగాహన

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట పరిధిలోని రింగ్ బస్తీ, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దోమల నివారణపై ఎంటమాలజీ సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఈ అరుణ్ వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మల్లేష్, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.